

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 31 పుష్పం : 37 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 3-6-99, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నది భగవంతుడు ఒక్కడే అయితే ఆయన మనకు అనుభవంలోనికి రావటంలేదు. లౌకికులకు ఈ ప్రపంచం ఒక్కటే నిజం అనిపిస్తుంది. లౌకికులకు ఈ ప్రపంచం ఒక్కటే అని వారికి అనుభవంలో ఎలా తెలుస్తూ ఉంటుందో అంతకంటే బలంగా, అంతకంటే స్పష్టంగా భగవంతుడు ఒక్కడే అని భగవదనుభవం ఉన్నవారికి తెలుస్తుంది. దేహాభిమానం ఉన్నవాడికి దేహం ఒక్కటే అనే భావన ఎలా ఉంటుందో అలాగే ఆత్మభావన ఉన్నవాడికి ఆత్మ ఒక్కటే అనే భావన ఉంటుంది. ఎప్పుడైతే ఆత్మ జ్ఞానం కలిగిందో అదే కడసారి జన్మ, అయితే ఆత్మజ్ఞానం రాగం ఉన్నవారికి కలుగదు, వైరాగ్యం ఉన్న వారికి కలుగుతుంది అని పెద్దలు చెపుతారు. రాగం మన మనస్సును కలుషితం చేస్తుంది. వైరాగ్యం మనస్సును పవిత్రం చేస్తుంది, ఏకాగ్రం చేస్తుంది. బంధువులు పోయినప్పుడు స్మశానానికి వెళతాము. స్మాశానంలో ఉన్నప్పుడు మనకు ఎంత వైరాగ్యంగా ఉంటుందో మన ఇంట్లో ఎన్ని కంఫర్ట్సుమధ్య ఉన్నా కూడా అంత వైరాగ్యం ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది అని పెద్దలు చెబుతారు. ధర్మాన్ని ఆచరిస్తే క్రమశిక్షణ కలుగుతుంది. క్రమశిక్షణ వలన బుద్ధి అంతర్ముఖమవుతుంది. బుద్ధి అంతర్ముఖమయితే మన బుద్ధిని భగవంతుడు తీసుకొని భగవంతుని బుద్ధిని మనకు ఇస్తాడు. మన బుద్ధిలో రాగం, ద్వేషం, మమకారం ఉంది. మన బుద్ధిలోని దోషములే మనలను ఈ లోకానికి, దేహానికి కట్టి వేస్తున్నాయి. బుద్ధిలో దోషాలు పోవాలంటే నిరంతరము భగవంతుని స్మరణ వలన అవి తొలుగుతాయి. బుద్ధి పతనమైతే మానవుడు పతనమవుతాడు. అందుచేత బుద్ధిలో ఉన్న వివేకాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. వివేకాన్ని పోషించుకొంటే వివేకవంతంగా జీవించటానికి అవకాశం ఉంటుంది. ఈ లోకంలో ఎవడి జీవితం అయితే ప్రశాంతంగా ఉంటుందో, వివేకవంతంగా ఉంటుందో, నిర్మాణాత్మకంగా ఉంటుందో వాడి జీవితం ధన్యం, వాడు పుణ్యాత్ముడు, వాడికి మోక్షం కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించాలన్నా మోక్షాన్ని సంపాదించాలన్నా, వివేకంగా జీవించాలన్నా శరీరం ఆరోగ్యంగా ఉండాలి. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో జాగ్రత్తగా ఉండాలి.

భగవంతుని చింతించగా చింతించగా, భగవంతుని ప్రీతికోసం జీవించగా జీవించగా,

భగవంతుడిని భగవంతుడికోసమే సేవిస్తూ ఉంటే ఆయన అనుగ్రహానికి మనం పాత్రులవుతాము. అప్పుడు మనం కోరుకోకుండానే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం ఏదో విషయం మనస్సులో పెట్టుకొని ఈశ్వరుని అర్చన చేస్తాము అనుకోండి. అది వ్యాపారభక్తి అవుతుంది. మనది వ్యాపార భక్తా, ప్రేమభక్తా మనకు భగవంతుడు కావాలో లేక ఆయన కల్పించిన సృష్టి కావాలో అని మనలోపల ఉండి భగవంతుడు అంతా చూస్తూ ఉంటాడు. ఆయనకు తెలియకుండా మనం ఏపని చేయలేము. ఆయన సర్వసాక్షి, భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. కాని మన అనుభవానికి చిక్కటం లేదు. మన బుద్ధిలో ఉన్న దోషాలు పోతే దానికి అంతర్‌దృష్టి కలుగుతుంది. బుద్ధికి అంతర్‌దృష్టి కలిగితే హృదయంలో ఉన్న ఈశ్వరుడు దగ్గరకు అది వెళుతుంది. అక్కడకు వెళితే సరిపోదు అక్కడ ఉండగలగాలి. అలా ఎప్పుడు ఉంటుందంటే వాసనల యొక్క వేగం తగ్గే కొలది బుద్ధి హృదయంలో నిలబడి ఉంటుంది. అప్పుడు ఈశ్వరసాక్షాత్కారము కలుగుతుంది. ఇప్పటి వరకు ఏదో ఉంది, ఏదో ఉంది అనుకొన్నాము కాని ఉన్నది ఈశ్వరుడే అని అప్పుడు మీకు తెలుస్తుంది. ఆ అనుభవం మీకు కలిగినప్పుడు ఏ విషయాలు అయితే మిమ్మల్ని ఈ లోకానికి పట్టి ఉంచుతున్నాయో ఆ తెరలు అన్నీ తెగిపోతాయి. మీకు ధనం ఉన్నా, కీర్తి ఉన్నా, పాండిత్యం ఉన్నా పరమేశ్వరుని పట్ల పరిపూర్ణమైన విశ్వాసం లేకపోతే మనం ఎండిపోయిన రొట్టెముక్కలా ఉంటాము.

ప్రపంచంలో అనేక రకాల దోషాలు లేవు, అనేక రకాల చెడ్డలు లేవు. ఉన్నది ఒక్కటే చెడ్డ, ఉన్నది ఒక్కటే పాపం అదే అజ్ఞానం. మనకి శాంతిగా ఉన్నా, జ్ఞానంగా ఉన్నా అది పోవాలని అనుకోము అదే మనం కాబట్టి. అజ్ఞానం ఉంటే అశాంతి ఉంటే అది పోగొట్టుకోవాలి అనుకొంటాము. మా అజ్ఞానం పోలేదు అంటారు అంటే వాడు అజ్ఞానం కాదు అని వాడికి తెలుస్తోంది. మనం చేసే ప్రతీ ప్రయత్నం అజ్ఞానంలో నుండి బయటకు రావటానికి చేయాలి. అజ్ఞానమును ఎవడైతే తొలగించుకొంటాడో వాడు జ్ఞాన సింహాసనాన్ని అధిష్టిస్తాడు. జనన మరణ చక్రం నుండి విడుదల పొందుతాడు. సత్కర్మ ఆచరిస్తే, మనస్సును భగవంతుని పాదాలయందు నిలబెట్టి ఉంచితే ఏదైతే నేను, నేను అంటున్నావో ఆ నేను అనే వృత్తినశిస్తుంది. అంటే దేహగతమైననేను నశిస్తుంది. దేహగతమైననేను పోతే నీవు పోవు నీవు ఎవడో నీకుతెలుస్తుంది. వందకోట్లు డబ్బు ఉన్నవాడికి చొక్కాచిరిగి పోయింది అనుకోండి వాడు ఏమీ బాధపడడు. అది వాడికి చాలా చిన్న విషయం. అలాగే మహాజ్ఞానికి దేహంపోయినా ఏమీ అనిపించదు. ఎందుచేతనంటే దేహం పోవటం వలన ఏమీ నష్టం లేదు, దేహం ఉండటం వలన ఏమీ లాభం లేదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది.

సమగ్రంగా జీవించి, సమగ్రంగా వైరాగ్యం పెట్టుకొని అభ్యాసము చేసి నీ తూకం పెంచుకొని మూలతలంపు యొక్క మూలంలోనికి వెళ్ళి అక్కడ ఉంటే ఆ మూలతలంపు నశిస్తుంది. అది జ్ఞాన మార్గం. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సంపూర్ణంగా విశ్వసించి నాభారం

అంతే నీదే అని ఆయనను వేడుకొంటే అప్పుడు కూడా దేహగతమైన నేను నశిస్తుంది. అది శరణాగతి మార్గం. నీవు ఏ మార్గములో ప్రయాణం చేసినా ఈ దేహగతమైన నేనులో నుండి విడుదల పొందాలి. నీకు ఎంతధనం ఉన్నా, కీర్తి ఉన్నా అజ్ఞానం నశించక పోతే మనిషి వెంట నీడ వచ్చినట్లు దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. సాధకుడికి అసాధ్యం అంటూ ఏదీలేదు. మనం అభ్యాసం చేయగా చేయగా అన్నీ సాధ్యమే. అందులో సందేహం లేదు. మనం ఏదైన పని చేసేటప్పుడు అహంకారమును ముందు పెట్టుకొని, అజ్ఞానమును ముందుపెట్టుకొని పని చేయకూడదు. జ్ఞానమును ముందు పెట్టుకొని, శాంతిని ముందు పెట్టుకొని పని మొదలు పెట్టాలి. అప్పుడు ఆ పని విజయవంతం అవుతుంది. మంచి సలహావింటే అది కృష్ణ సారధ్యం. చెడ్డసలహావింటే అది శల్య సారధ్యం. మనం కృష్ణుడిని సారధిగా పెట్టుకోవాలి. శల్యుడిని సారధిగా పెట్టుకొంటే కర్ణుడికి పట్టినగతే మనకూ పడుతుంది. దైనందిన జీవితంలో నీ దేహప్రార్థమును బట్టి ఏది వస్తే దానితోనీవు సంతృప్తి పడితే నీవు శరణాగతి మార్గానికి పనికి వస్తావు. కొంతమంది భక్తులు కోట్లు డబ్బు ఉన్నా ఏమీ లేనట్లు నిశ్చలంగా ఉంటారు. కొంతమంది పదిరూపాయలు ఉన్నా ఇముడ్చుకోలేరు. నీకు ఇముడ్చుకొనే శక్తి లేకపోతే ఈశ్వరానుగ్రహం కలుగదు. సహనం, ఓర్పు ఉన్నవాడికి హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. కోరిక లేకుండా ఉంటే, భయం లేకుండా ఉంటే నీకుటుంభ పరిస్థితులు, సామాజిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నీవు సుఖంగా, శాంతిగా ఉంటావు.

ఆత్మానుభవం పొందినవాడు ఎక్కడయితే ఉన్నాడో ఆ పరిసరాలు అన్నీ చల్లగా, ప్రశాంతంగా ఉంటాయి. మీ ప్రయత్నం లేకుండా అక్కడ మీ మనస్సులు చల్లబడతాయి. భగవంతుడు ఉన్నాడని చెప్పేవాడి హృదయంలోనూ భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు లేడు అని చెప్పేవాడి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. కాని ఇద్దరిలోనూ భగవంతుడు వ్యక్తం కాడు. దేహభావన తగ్గించుకొంటూ దైవభావన పెంచుకొంటూ ఉంటే ఆ ఉపాధి ద్వారా భగవంతుడు వ్యక్తమవుతాడు.

మీ చేతిలో ఉన్నపనిని ప్రేమగా, ఇష్టంగా చేయాలి. మనం ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే, మనం ఉండగలిగినంత క్రమశిక్షణగా ఉంటే చీకటిలోకాలకు, మహాభయంకర పరిస్థితులలోనికి వెళ్ళకుండా మీ ధర్మం మిమ్మల్ని కాపాడుతుంది. ప్రతీ మానవుడు తన అహంభావనలో ఏదో విశేషం ఉంది అనుకొంటాడు. సత్పురుషులను సేవించటం వలన, శాస్త్రాన్ని శ్రవణం చేయటం వలన అహంభావనలో విశేషం ఏమీలేదు అని తెలుస్తుంది.నీవు భగవంతుడి కంటే భిన్నంగా ఉన్నావా? లేదు. కాని భగవంతుడు కంటే భిన్నంగా ఉన్నాను అని అనుకోవటం వలన నీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటున్నావు. అహంభావన యొక్క అల్పత్వం నీకు తెలియాలి. అప్పుడు దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తావు. అహంభావన యొక్క అల్ఫత్వం నీకుతెలియకపోతే దానిని తొలగించుకొనే ప్రయత్నం చేయవు. దాని అల్పత్వం తెలియటానికే

శ్రవణభక్తి అవసరం. మనం శరీరాన్ని చాలా శుభ్రంగా ఉంచుకొంటున్నాము, శరీరాన్ని ఎంతశుభ్రంగా ఉంచుకుంటున్నామో మనస్సునుకూడా అంత శుభ్రంగా ఉంచుకోవాలనే సంకల్పమే మనకు రావటంలేదు. మన శరీరాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకొంటున్నామో మనస్సును కూడా అంత శుభ్రంగా ఉంచుకోవాలి లేకపోతే మనస్సు పల్చబడదు.

మీరు ఏ మార్గంలో ప్రయాణించినప్పటికీ, మీ గురువు ఎవరైనప్పటికి మనస్సులో కల్మషం ఉన్నవారికి ఏమీ రాదు. మనకంటే ముందు మన అహంభావన వెళుతూఉంటే ఇంక మనం ఏమి బాగుపడతాము. ఎంతోకొంత భక్తి ఉండాలి, అర్పణభావన ఉండాలి. అహంభావన లోనుండి విడుదల పొందటమే మోక్షం. నీవు ఏదైనా మంచిపనిచేసినా, పూజచేసినా, గుడి చుట్టూ తిరిగినా, శాస్త్రాలు అధ్యయనం చేసినా, సత్పురుషుల సహవాసం చేసినా, నీవు ఏది చేసినా లోపల అహంభావన ఎంతవరకు తగ్గుతోందో మధ్య మధ్య చూసుకోవాలి.నీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం యజ్ఞ,దాన,తపస్సులను విడిచిపెట్టవద్దు అని గీతలో భగవంతుడు చెప్పాడు. యజ్ఞం అంటే స్వార్థం లేకుండా పనిచేయటం, దానం అంటే ఇతరుల సుఖం కోసం పనిచేయటం, తపస్సు అంటే మనస్సును శరీరాన్ని శిక్షించటం. మనం ఏ పని ఎందుకు చేస్తున్నామో మనలోపల ఉన్న కంట్రోలర్ చూస్తూ ఉంటాడు. మీరు మంచిని ఆలోచించండి. ఎంతవరకు ఆచరించగలిగితే అంతవరకు మంచిని ఆచరించండి. భవిష్యత్‌లో మహా ప్రమాదం నుండి బయటకు వస్తారు అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతునివైపు నీ బుద్ధి తిరుగుతూ ఉంటే నీకు వ్యర్థమైన చింతలు, కోరికలు తగ్గుతాయి. కర్మఫల త్యాగి సన్యాసి. వాడు ఇహంలోను, పరంలోను పొందవలసినది పొందుతాడు. ఈ లోకంలో ఉండగా, ఈ దేహంలో ఉండగా మరణం లేని వస్తువు ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడు గురువుగా ఉండటానికి అర్హుడు. ఇతరులను గైడ్ చేయటానికి వాడికి అవకాశం ఉంది. తలంపులు వలనే మనకు దుఃఖం వస్తోంది. భగవంతునికి శరణాగతి పొందేకొలది ఉపయోగంలేని తలంపులు ఆగిపోతాయి. ఈమధ్య ప్రతిమ అనే అమ్మాయి నన్ను అడిగింది నాన్నగారు నాకు రెండు చేతులు ఉన్నాయి ఈ చేతులతో ఎప్పుడూ మంచి పనులు చేసేటట్లు అనుగ్రహించండి అంతే నేను కోరేది అని అడిగింది. తరువాత ఇంకోటి చెప్పింది చేతులు ఏవైన మంచి పనులు చేసినా చేతులు మర్చిపోతున్నాయి గాని మనస్సు మర్చిపోవటంలేదు. చేతులు ఎలా మర్చిపోతున్నాయో మనస్సుకూడా అలా మర్చిపోయేటట్లు అనుగ్రహించండి అని అడిగింది. ఎంత బాగుందో చూడండి. మనం ఏదైనా మంచి పనులు చేసినా సంకల్పంలో తేడా ఉంటే కొంత పుణ్యంరావచ్చు, మోక్షంరాదు, అసలు వస్తువు నీకు దొరకదు.

Printed and published by P.S. Rama Raju at Shriram Graphics, Palakol ☎ 24776